క్లుప్తంగా

మేల్‌మరవత్తూరుకు తరలిన భక్తులు



మేల్‌మరవత్తూర్‌కి బయలుదేరిన భక్తులు

గంగవరం: మండలంలోని పసుపత్తూరు పంచాయతీ మార్జేపల్లి గ్రామం నుంచి పదుల సంఖ్యలో ఓంశక్తి భక్తులు శనివారం మేల్ మరవత్తూర్‌లోని ఓంశక్తి ఆలయానికి బయలుదేరి వెళ్లారు. గ్రామానికి చెందిన మహిళలు, పురుషులు కలిసి కొన్నిరోజులు క్రితం ఓంశక్తి మాల ధరించారు. అప్పటి నుంచి రాత్రిపూట గ్రామంలో భజనలు చేస్తూ భక్తిశ్రద్ధలతో అమ్మవారిని పూజిస్తారు. అమ్మవారి దర్శనార్థం భక్తులంతా కలిసి మేల్‌మరవత్తూర్‌కి బయలుదేరి వెళ్లారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి విజయ్‌చంద్ర

బైరెడ్డిపల్లె: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి విజయ్‌చంద్ర తెలిపారు. బైరెడ్డిపల్లెలో శనివారం గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు పోషకాహారం బాగా తీసుకోవాలన్నారు. ప్రతి నెలా వైద్యాధికారుల సలహాలను, సూచనలను పాటించాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించినప్పుడే ఆరోగ్యవంతంగా ఉంటారని సూచించారు. కోవిడ్ నిబంధనలు పాటించాలన్నారు. వ్యాధి నిరోధక టీకాలు, కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించారు. అనంతరం బైరెడ్డిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

సబ్సిడీపై వేరుశనగ విత్తనాలు

పులిచెర్ల(కల్లూరు): గత తుపాను వల్ల మండలంలో వేరుశనగ పంట దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం 80 శాతం సబ్సిడీతో వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయ శాఖాధికారి హరిప్రసాద్ శనివారం తెలిపారు. మండలంలో 24 మంది రైతులు 26 ఎకరాల్లో సాగు చేసిన వేరుశనగ పంట తుపాను వల్ల దెబ్బతినిందన్నారు. ఇందుకోసం తిరిగి పంట వేసుకోవడానికి మండలానికి 48 బస్తాల విత్తనాలు రావడం వచ్చాయని, ఒక్కోబస్తా సబ్సిడీ పోను రూ.515 చెల్లించాల్సి ఉందన్నారు. పంట దెబ్బతిన్న రైతులకు ఈవిత్తన కాయలు ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు.

పెండింగ్ బకాయిలను చెల్లించాలి



మాట్లాడుతున్న మనోహర్ రెడ్డి

పలమనేరు: పదకొండో పీఆర్సీకి సంబంధించిన పెండింగ్ డీఏ బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఏపీ పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు మనోహర్ రెడ్డి సూచించారు. పట్టణంలో పెన్షనర్ల కార్యాలయంలో శనివారం సంఘ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛన్‌నే నమ్ముకున్న తమ కుటుంబాలకు సకాలంలో పింఛను అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. గడువు మీరితే ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో సంఘనేతలు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో ఓఎస్డీ భాస్కర్‌రెడ్డి



భాస్కర్‌రెడ్డికి తీర్థ ప్రసాదాలు అందిస్తున్న అర్చకులు

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మను ఓఎస్డీ భాస్కర్‌రెడ్డి శనివారం దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో ఆలయ కమిటీ చైర్మన్ మిద్దింటి శంకర్‌నారాయణ ఆయనకు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం ఓఎస్డీకి అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. పుంగనూరు నియోజకవర్గంలో కొత్తగా మంజూరైన పనులను, అదనపు సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను ఆ యన పరిశీలించారు. ఏఈ రాజశేఖర్ ఉన్నారు.

నిరాశ్రయులకు ఉచిత న్యాయసేవలు

చిత్తూరు అర్బన్: నిరాశ్రయులకు ఉచిత న్యాయసేవలు అందిస్తామని సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్ అన్నారు. చిత్తూరులోని నిరాశ్రయుల వసతి గృహంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. నిరాశ్రయులకు న్యాయపరమైన సలహాలు ఇచ్చారు. అనంతరం ఆధార్ కార్డులను పంపిణీ చేశారు. వైద్యశిబిరం నిర్వహించి మందులు, మాత్రలు అందజేశారు. నిర్వాహకులు జోసెఫ్‌రాజు, డాక్టర్ బాలా పాల్గొన్నారు

అడుగడుగునా అపూర్వ ఆదరణ

- ప్రతి గ్రామంలో మంత్రి పెద్దిరెడ్డికి ఘన స్వాగతం
- పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం
- సంక్షేమంపై అవగాహన కల్పించిన మంత్రి



సోమల: ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సోమల: మండలంలో నాలుగు రోజుల పాటు కొనసాగిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటనకు అపూర్వ స్పందన లభించింది. గ్రామస్తులు అన్ని చోట్లా ఆయనకు ఘనస్వాగతం పలికారు. ప్రజలతో మమేకమై కుశల ప్రశ్నలతో మాట్లాడిస్తూ.. వారి యోగక్షేమాలపై ఆరా తీశారు. సమస్యలను ఆలకించి అక్కడికక్కడే పరిష్కరించేలా అధికారులకు సూచనలిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరంగా వివరించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదరిక నిర్మూలనకు నిస్వార్థంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్టు వివరించారు. ప్రతిపక్షాలు స్వార్థంతో వైఎస్సార్‌సీపీపై దుష్ప్రచారం చేస్తున్నట్టు తెలియజేశారు. నియోజకవర్గంలో విస్తృతంగా అభివృద్ధి పనులు చేపట్టి ప్రజల రుణం తీర్చుకుంటున్నట్టు స్పష్టం చేశారు. శనివారం ఆయన కందూరు, వల్లిగట్ల, కామిరెడ్డిగారిపల్లె పంచాయతీల పరిధిలోని 38 గ్రామాల్లో పర్యటించారు. బాలప్పగారిపల్లెలో కమ్యూనిటీ భవనం, కందూరులో ఆర్వో ప్లాంటు, సచివాలయ భవనం, పాతూరులో సచివాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. కందూరు సర్పంచ్ బాషా



పాతూరులో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి

మసూద్ కుమారుడి జన్మదిన వేడుకలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈశ్వరయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు, మండల కన్వీనర్ గంగాధర్, నాయకులు నాగభూషణంరెడ్డి, రవీంద్రరెడ్డి, మల్లికార్జునరెడ్డి, నిరంజన్ రెడ్డి, మెకానిక్ బాషా, వరదం రమణ, సర్పంచ్‌లు బాషా మసూద్, సౌజన్య, శ్రీదేవి, ఎంపీటీసీ కల్యాణి, జిల్లా సేవాదళ్ ప్రధాన కార్యదర్శి బాలసుబ్రమణ్యం, అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన పర్యటన

మండంలో గత నాలుగు రోజులుగా 15 పంచాయతీల పరిధిలోని 164 గ్రామాల్లో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విస్తృతంగా పర్యటించారు. పింఛన్ల పంపిణీ, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, సమస్యలపై వినతులు స్వీకరించారు. శనివారం సోమలలో మంత్రి పర్యటన ముగిసింది.

నిత్యం స్పందన నిర్వహించాలి



రికార్డులను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: సచివాలయాల్లో ప్రతి నిత్యం స్పందన కార్యక్రమం నిర్వహించాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. శనివారం ఆయన పట్టణంలోని అంబేడ్కర్ నగర్ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టిక, సీఎల్, మూమెంట్ రిజిస్టర్లు, స్పందన, సచివాలయ సర్వీస్ రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిత్యం సాయంత్రం వేళ సచివాలయాల్లో తప్పనిసరిగా స్పందన కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. స్పందనలో వచ్చిన సమస్యలను వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస విశ్వనాథ్

పెద్దపంజాణి: నవరత్నాల పథకాల్లో భాగంగా పేదలకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి, ఉగాది నాటికి గృహ ప్రవేశాలు జరిగేలా కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాస విశ్వనాథ్ తెలిపారు. శనివారం ఆయన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సచివాలయాల వారీగా లక్ష్యం నిర్దేశించి జనవరి నెలాఖరుకు 197 గృహాలు పూర్తి చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ భాగారెడ్డి, హౌసింగ్ ఏఈ చంద్రశేఖర్ రెడ్డి, ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ పవన్ కుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



మామిడికాయల మార్కెట్ స్థలాన్ని పరిశీలిస్తున్న మార్కెటింగ్ సంచాలకులు రామాంజినేయులు

పలమనేరు: పలమనేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను కడప ప్రాంతీయ సంయుక్త మార్కెటింగ్ సంచాలకులు రామాంజినేయులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టణంలోని మార్కెట్‌కమిటీలో వివిధ విభాగాలను తిరిగి చూశారు. క్యాటిల్‌ఫామ్ వద్ద నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ టమాటా మార్కెట్ పనులను పరిశీలించారు. అలాగే వీ.కోట మండలంలోని శివునికుప్పం వద్ద జరుగుతున్న మామిడికాయల మార్కెట్ పనులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చే మామిడి సీజన్‌లోపు ఇక్కడ వ్యాపారాలను ప్రారంభించేలా చొరవ చూపాలని స్థానిక మార్కెట్ కమిటీ చైర్మన్ హేమంత్‌కుమార్ రెడ్డికి సూచించారు. కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, ఎమ్మార్ వేణు, కార్యదర్శి సంజీవకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సొంతింటి సాకారమే ప్రభుత్వ లక్ష్యం



లేఅవుట్‌ను పరిశీలిస్తున్న ఎంపీపీ యువరాజు

వి.కోట: రాష్ట్రంలో పేదలకు సొంతింటి కల నెరవేర్చాలనే లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అర్హులకు ఇళ్లు మంజూరు చేశారని ఎంపీపీ యువరాజు అన్నారు. శనివారం మండలంలోని కుంభార్లపల్లి గ్రామ సచివాలయాన్ని ఆయన తనిఖీ చేసి, జగనన్న లేఅవుట్‌ను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. బిల్లులు కూడా లబ్ధిదారుల ఖాతాల్లో సక్రమంగా జమ అవుతున్నాయని, మార్చి ఒకటో తేదీ నాటికి సామూహిక గృహప్రవేశాలు చేయాలన్నారు. ఇదే గ్రామంలో గత 40 ఏళ్లుగా మైనారిటీలకు శ్మశాన వాటిక లేకపోవడంతో జగనన్న ప్రభుత్వం వచ్చాక ఎమ్మెల్యే వెంకటేగౌడ అధికారులతో మాట్లాడి స్థలాన్ని కేటాయించారన్నారు. శ్మశాన వాటిక మరమ్మతుల కోసం ఆర్థికసాయం చేస్తామని ఎంపీపీ తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ అశోక్, సర్పంచ్ సుభాష్, ఎంపీటీసీ మురుగేష్, మాజీ సర్పంచ్ శ్రీరాములురెడ్డి, కన్వీనర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రచార ఆర్భాటం కోసమే చంద్రబాబు పర్యటన



మాట్లాడుతున్న విజలాపురం బాబురెడ్డి

రామకుప్పం: ప్రచార ఆర్భాటం కోసమే చంద్రబాబు నాయుడు కుప్పం పర్యటన చేపట్టారని మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి అన్నారు. మండలకేంద్రం రామకుప్పంలో వైఎస్సార్‌సీపీ నేతలు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు నాయుడు చట్టాలను గౌరవించకపోవడం శోచనీయమన్నారు. కుప్పం పర్యటనకు వచ్చిన ప్రతిసారీ టీడీపీ కార్యకర్తలను రెచ్చగొట్టి ప్రశాంతంగా ఉన్న అల్లర్లు సృష్టిస్తున్నారన్నారు. ఉద్దేశపూర్వకంగా అల్లర్లు సృష్టించడానికి కుప్పం పర్యటనకు వస్తే చంద్రబాబుకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు.

అక్రమాలపై బహిరంగ చర్చకు సిద్ధమా ?

వైఎస్సార్‌సీపీ నాయకులు అక్రమాలకు పాల్పడ్డారంటూ చంద్రబాబు చేసిన ఆరోపణలకు స్థానిక టీడీపీ నేతలు బహిరంగ చర్చకు సిద్ధమా? అని బాబురెడ్డి సవాల్ విసిరారు. 2014–19 మధ్యకాలంలో కుప్పంలో టీడీపీ నేతలు చేసిన అవినీతి, అక్రమాలను ఆధారాలతో సహా నిరూపించడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. నీరు–చెట్టు కార్యక్రమం, వాటర్ ట్యాంకుల ద్వారా నీటి సరఫరా చేసి తప్పుడు రికార్డులను సృష్టించి కోట్లాది రూపాయిలను స్వాహా చేసిన ఘనత టీడీపీ నేతలకే దక్కిందన్నారు. బహిరంగ విచారణకు వైఎస్సార్‌సీపీ సిద్ధంగా ఉందన్నారు. టీడీపీ నేతలు తేదీని ఖరారు చేయాలన్నారు.

టీడీపీలో చేరింది వలంటీర్లు కాదు..

మండలంలోని బందార్లపల్లి పంచాయతీకి చెందిన ఇద్దరు వలంటీర్లు చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరినట్లు వస్తున్న వార్త అవాస్తమని స్థానిక సర్పంచ్ రాజ్‌గోపాల్ అన్నారు. కృష్ణానగర్ వలంటీర్‌జయ భారతి భర్త మోహన్ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నాడని స్థానికులు ఫిర్యాదు చేయడంతో ఆమెను వలంటీర్‌గా తొలగించామన్నారు. అదేవిధంగా గడ్డూరు వలంటీర్‌గా పనిచేస్తున్న పురుషోత్తం రెడ్డి గత 6 నెలలుగా ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేసుకుంటూ ప్రజలకు అందుబాటులో లేకపోవడంతో తొలగించినట్లు తెలిపారు. బందార్లపల్లి పంచాయతీ వైఎస్సార్‌సీపీ యువత అధ్యక్షుడిగా చెప్పుకుంటున్న గిరిబాబు అసలు ఆ పదవిలో లేరన్నారు. జెడ్పీటీసీ నితిన్ రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, పార్టీ కోకన్వీనర్ చంద్రారెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, నేతలు రామకృష్ణారెడ్డి, రామలింగారెడ్డి, లక్ష్మణ రెడ్డి, కేశవరెడ్డి పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడలు అవసరం



యువజన వారోత్సవాల ప్రారంభోత్సవంలో ప్రసంగిస్తున్న సీఐ శ్రీధర్

కుప్పం: విద్యతో పాటు విద్యార్థులకు క్రీడలు కూడా ఎంతో అవసరం అని కుప్పం అర్బన్ సీఐ శ్రీధర్ తెలిపారు. శనివారం కుప్పం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో యువజన వారోత్సవాల సందర్భంగా క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ మధ్యకాలంలో యువత డ్రగ్స్ వినియోగానికి అలవాటు పడుతున్నారని, ఇది మంచి పద్ధతి కాదని సూచించారు. డ్రగ్స్‌కు అలవాటు పడినా వారి భవిష్యత్ అంధకారంగా మారుతుందన్నారు. పిల్లలపై ఎన్నో ఆశలు పెట్టుకున్నా తల్లిదండ్రులు అన్యాయం చేసిన వారు అవుతారని ఆయన సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో బాగా చదువుకుని భవిష్యత్‌ను బంగారుబాట వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ శ్రీనావాసులు, ఎస్ఐ శివకుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇళ్ల వద్దే పింఛన్ పంపిణీ



పింఛన్లు అందిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు కృష్ణమూర్తి

గుడుపల్లె: రాష్ట్రప్రభుత్వం పెంచిన పింఛన్లు వలంటీర్లు ఇళ్ల వద్దే అందించాలని జెడ్పీటీసీ సభ్యులు కృష్ణమూర్తి తెలిపారు. శనివారం మండలంలోని పొగరుపల్లె, దాసిమానిపల్లె తదితర గ్రామాల్లో వైఎస్సార్ పింఛన్ల వారోత్సవాలను గ్రామాల్లో నిర్వహించారు. నూతనంగా మంజూరైన పింఛన్లు వారందరికీ ఇళ్ల వద్దకే వచ్చి ఇస్తారన్నారు. ఏడాదికి ఒకసారి పెంచుతూ ఈసారి ప్రతి ఒక్కరికీ రూ.2,750 ప్రకారం ఒకటో తేదీరోజు మధ్యాహ్నం లోపు ఇళ్ల వద్ద తలుపు తట్టి ఇస్తున్నారన్నారు. పింఛన్ల కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో మాజీ రెస్కో చైర్మన్ సోమశంకర్‌రెడ్డి, మండల కన్వీనర్ రామకృష్ణ, సింగిల్‌విండో చైర్మన్ కృష్ణమూర్తి, సర్పంచ్‌లు ఎంపీటీసీలు, నాయకులు అనంతరెడ్డి, సుందరం పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కుప్పం: మండల పరిధిలోని పలు విద్యుత్ కేంద్రాల్లో మర్మమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉటుందని రెస్కో ఎండీ సుబ్రమణ్యం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని 33 కేవీ సబ్‌స్టేషన్ గుడ్లనాయనపల్లి, చెక్కునత్తం, గుడుపల్లె, కుప్పం, వసనాడు ఉప విద్యుత్ కేంద్రాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు. ఈ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

రేషన్, ఆరోగ్యశ్రీ కార్డుల అందజేత



సతీష్‌కు కార్డులను అందిస్తున్న నాయకులు

కుప్పంరూరల్: కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో ఉంటున్న సతీష్ కుమారుడు ఐదేళ్ల చిన్నారి యశ్వంత్ బోన్ క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. వైద్యం కోసం ఆస్పత్రికి వెళ్తే లక్షలు ఖర్చు అవుతాయని డాక్టర్లు చెప్పారు. అయితే సతీష్‌కు రేషన్‌కార్డు లేకపోవడంతో ఆరోగ్యశ్రీ సైతం వర్తించ లేదు. దీంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న సతీష్ సమస్యను స్థానికులు 13వ వార్డు కౌన్సిలర్ హంస సోమశేఖర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కౌన్సిలర్ వారం రోజుల్లోనే అధికారులతో మాట్లాడి రేషన్‌కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు అందేలా చూశారు. స్థానిక నాయకులు సోమశేఖర్, గణపతి, చీలేపల్లి రవి శనివారం సతీష్ ఇంటికి వెళ్లి రేషన్, ఆరోగ్యశ్రీ కార్డులను అందజేశారు.

సాగు, తాగునీటికి ప్రాధాన్యం



పుంగనూరు: గడప గడపకు కార్యక్రమంలో ఎంపీ మిథున్‌రెడ్డికి హారతులు పడుతున్న మహిళలు

- పుంగనూరులో అభివృద్ధి పరుగులు
- రెచ్చగొట్టే వారి పట్ల సంయమనం పాటించండి
- ఎంపీ మిథున్‌రెడ్డి

పుంగనూరు: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పడమటి నియోజకవర్గాలకు సాగు, తాగు నీరు అందించడం జరుగుతోందని, అందుకోసం హంద్రీనీవా కాలువ సామర్థ్యాన్ని పెంచి మూడు రిజర్వాయర్లు నిర్మిస్తున్నామని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన పుంగనూరు పట్టణంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ నీటి సమస్య తీర్చేందుకు నేతిగుట్లపల్లె రిజర్వాయర్‌లో ఒక టీఎంసీ నీటిని, ఆవులపల్లె రిజర్వాయర్‌లో మూడు టీఎంసీల నీరు నిల్వలు ఉండేలా రిజర్వాయర్ల పనులు చురుగ్గా సాగుతున్నాయని తెలిపారు. అలాగే తంబళ్లపల్లె నియోజకవర్గంలో రిజర్వాయర్ నిర్మిస్తున్నామన్నారు. హెచ్ఎన్ఎస్ఎస్ కాలువల విస్తరణ పనులు చేపట్టి పుంగనూరు, పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాలకు తాగునీరు, సాగునీరు సమస్య లేకుండా చేయనున్నట్లు తెలిపారు. అలాగే వైఎస్సార్ జిల్లా గండికోట నుంచి పైపులైన్లు వేసి పడమటి నియోజకవర్గాలకు నీటి సమస్య లేకుండా చేసే బృహత్తర కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిందన్నారు. వచ్చే 30 ఏళ్ల వరకు కూడా మంచినీటి సమస్య తలెత్తకుండా ఉండేలా ఈ కార్యక్రమం రూపొందించామన్నారు. నియోజకవర్గంలో అన్నిరకాల అభివృద్ధి చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, వైస్ చైర్మన్లు నాగేంద్ర, లలిత, వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము , వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి ఫక్రుద్దీన్‌షరీఫ్ తోపాటు కౌన్సిలర్లు , అధికారులు పాల్గొన్నారు.

ఆప్యాయంగా పలకరిస్తూ..

గడప గడపకు కార్యక్రమంలో ఎంపీ మిథున్‌రెడ్డి ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. అక్కా పెన్షన్ వస్తోందా..? అవ్వా జగనన్న నీ ఖాతాకు ఎన్ని లక్షలు వేశారు..? అంటూ సరదాగా మహిళలతో సంభాషించారు. ఉద్యోగం లేక ఇబ్బంది పడుతున్న సంధ్య అనే యువతికి జాబ్ ఇప్పిస్తామన్నారు. మున్సిపల్ కార్మికుడి భార్య రేఖకు ఉద్యోగంతో పాటు రూ.50 వేలు ఆర్థిక సహాయం అందించారు. అలాగే సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయాలని, పెన్షన్ ఇవ్వాలని పలువురు కోరగా వాటిని పరిష్కరిస్తామన్నారు.

సంయమనం పాటించండి..

పుంగనూరు నియోజకవర్గంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి కొంతమంది ఓర్వలేక ఆరోపణలు చేయడం, రెచ్చగొట్టడం చేస్తున్నారని, ప్రతి ఒక్కరూ సమయనం పాటించాలని ఎంపీ మిథున్‌రెడ్డి సూచించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అభివృద్ధే అజెండాగా సాగుతోందన్నారు. అలాగే మండలంలోని ఆరడిగుంటలో శ్రీకాళహస్తి పైపుల పరిశ్రమల వారు సంక్రాంతి తరువాత ఫెర్రాఅలయ్ పరిశ్రమ పనులను ప్రారంభిస్తారని ఎంపీ తెలిపారు. ఈ పరిశ్రమలో సుమారు 600 మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు.

అభివృద్ధిని ఓర్వలేకే చంద్రబాబు ఉక్రోశం



దొంకుమాకనపల్లిలో సంక్షేమ బావుటా బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్సీ భరత్

- ఎమ్మెల్సీ భరత్

శాంతిపురం: రాష్ట్రంలో పేద, మధ్య తరగతి కుటుంబాలు అభివృద్ధి చెందడం చూసి ఓర్వలేక టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఉక్రోశం వెల్లబోస్తున్నారని ఎమ్మెల్సీ భరత్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం తుమ్మిశి, తులసినాయనపల్లి, దొంకుమాకనపల్లి గ్రామాల్లో ఇంటింటికీ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో ఆయన పార్టీకి చెందిన కొందరు మాత్రమే అభివృద్ధి చెందే వారని గుర్తు చేశారు. ప్రజల కష్టాలు తీరి అందరూ బాగుపడితే తనను మరచిపోతారనే భయం బాబుకు ఉందన్నారు. జనం అర్ధాకలితో బాధ పడుతుంటేనే ఆయన ఆనందంగా ఉంటారన్నారు. అందుకే నాలుగు దశాబ్దాలుగా తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పంలో ప్రజలకు పూర్తిస్థాయిలో కనీస వసతులను కల్పించలేకపోయారని చెప్పారు. కానీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టాక కుల, మత, రాజకీయ వివక్ష లేకుండా అందరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని తెలిపారు. నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి చేరుతున్న సంక్షేమ పథకాలతో కరోనా సంక్షోభాన్ని దాటి ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదుగుతోందని చెప్పారు. గ్రామ సచివాలయాలు, వలంటీర్లు ఎప్పటికప్పుడు ప్రజల అవసరాలు తీరుస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వసుంధర, ఎంపీడీఓ హేమమాలిని, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ చెంగప్ప, మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి, వైస్ ఎంపీపీ పట్టాభి, సర్పంచ్ చెంగమరాజు, నాయకులు కోదండరెడ్డి, విజయకుమార్, మురుగేష్, దేవేంద్రప్ప, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

రేపు సొన్నేగానిపల్లి పంచాయతీలో..

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం 30సొన్నేగానిపల్లి పంచాయతీలో నిర్వహిస్తున్నట్టు ఎంపీపీ వసుంధర, ఎంపీడీఓ హేమమాలిని తెలిపారు. ఎమ్మెల్సీ భరత్ కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు.

ఆలయ నిర్మాణానికి రూ.50 వేలు విరాళం

శాంతిపురం: మండలంలోని కెనమాకులపల్లిలో స్థానికులు నిర్మిస్తున్న ఆలయానికి ఎమ్మెల్సీ భరత్ రూ.50 వేలను విరాళంగా అందించారు. శనివారం గ్రామానికి వచ్చిన ఎమ్మెల్సీ స్థానికుల విజ్ఞప్తి మేరకు నిర్మాణంలోని ఆలయాన్ని పరిశీలించారు. భక్తులు చందాలు వేసుకుని నిర్మిస్తున్న పుంగాన్తం ఆలయాన్ని పూర్తి చేయడానికి సాయం చేయాలని తమిళనాడు నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడిన గ్రామస్తులు కోరారు. దీనిపై స్పందించిన భరత్ తక్షణం రూ.50 వేల నగదును వారికి అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి, నాయకులు చెంగప్ప, ఏవీ జయరాం, జగన్‌నాయుడు, పూంగావనం తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్సీ భరత్

రామకుప్పం: మండలంలోని బందార్లపల్లి పంచాయతీ లింగాపురానికి చెందిన టీడీపీ కార్యకర్తలు ఎమ్మెల్సీ భరత్ సమక్షంలో మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, స్థానిక సర్పంచ్ రాజ్‌గోపాల్ ఆధ్వర్యంలో శనివారం వైఎస్సార్‌సీపీలోకి చేరారు. వారికి ఎమ్మెల్సీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలోకి చేరిన వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై చేరినట్లు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో రియాజ్‌బాషా, బషీర్, ఇస్మాయిల్, అశ్మత్‌బాషా ఉన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నితిన్ రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, పార్టీ కో కన్వీనర్ చంద్రారెడ్డి, సీనియర్ నేతలు రామకృష్ణారెడ్డి, కేశవరెడ్డి, సుగుణప్ప పాల్గొన్నారు.

జల్లికట్టు నిర్వహిస్తే కేసులు తప్పవు

- అతిక్రమిస్తే జైలుకు వెళ్లాల్సి ఉంటుంది
- మైలేర్లను వ్యాపారంలా మార్చేశారు
- కోడిపందెం రాయుళ్లనూ వదలిపెట్టం



మాట్లాడుతున్న సీఐ చంద్రశేఖర్

పలమనేరు: పలమనేరు ప్రాంతంలో సంక్రాంతి సందర్భంగా ఎద్దుల పరుగుపందెం(మైలేర్లు), జల్లికట్టు నిర్వహిస్తే నిర్వాహకులపై కేసులు తప్పవని పలమనేరు సీఐ చంద్రశేఖర్ హెచ్చరించారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వీటిపై ప్రభుత్వ నిషేధం అమల్లో ఉందన్నారు. తమిళనాడు సంస్కృతిని ఇక్కడ కొందరు కొనసాగిస్తూ ఎద్దుల నుంచి ప్రవేశరుసుం పేరిట భారీగా వసూళ్లు చేసి దాన్నో లాభసాటి వ్యాపారంగా చేసుకున్నారని తెలిపారు. ఇకపై నిర్వాహకుల ఆటలు సాగవని ఇప్పటికే ఈ ప్రాంతంలో మైలేరు నిర్వహించే గ్రామాలు, నిర్వాహకుల సమాచారం సేకరించామన్నారు. అందులో భాగంగా బయ్యప్పగారిపల్లి, కాబ్బల్లి, దొడ్డిపల్లి, చెత్తపెంటలో ఇలాంటివి జరుగుతాయని తెలిసిందన్నారు. సంబంధిత నిర్వాహకులు మైలేరు నిర్వహించకూడదని సూచించామన్నారు. ఒకవేళ ఎవరైనా తాము చేస్తామని మైలేరి నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఇందులో ఎవరైనా వదిలే ప్రసక్తే లేదన్నారు. దీంతోపాటు సంక్రాంతి సందర్భంగా కోడిపందేలు ఆడే వారిపై ఇప్పటికే నిఘా పెట్టామన్నారు. నిర్వాహకులు ఇప్పటికైనా పోలీసులకు సహకరించాలని లేదంటే ఇబ్బందులు తప్పవని గట్టిగా హెచ్చరించారు.